క్లుప్తంగా...

పవర్ బోర్ పనులు ప్రారంభం

అడ్డగుట్ట: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు బీజేపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం అడ్డగుట్ట బీ సెక్షన్‌లో పవర్ బోర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ... కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించినప్పుడు స్థానిక సమస్యలు తెలుసుకున్నారన్నారు. అందులో భాగంగా ఆయన నిధులతో బీ సెక్షన్‌లో పవర్ బోర్ వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిజేపీ నాయకులు నాగేశ్వర్, హంసరాజు, వీరన్న, రాజు, మహేందర్, వేణు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత మధుయాష్కీపై విషప్రచారం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ మధుయాష్కీపై విషప్రచారం తగదని బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్న మధుయాష్కీగౌడ్‌ను కొందరు నాయకులు లోకల్, నాన్ లోకల్ అంశాన్ని లేవనెత్తడం సరికాదన్నారు. మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలిచిన రేవంత్‌రెడ్డి లోకల్‌లా అని ప్రశ్నించారు. మధుయాష్కీ విషయంలోనూ లోకల్ నాన్‌లోకల్ తేడా చూపకుండా టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి నేతలు గొడుగు మహేష్‌యాదవ్, పానుగంటి విజయ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



అడ్డగుట్ట: సికింద్రాబాద్ డివిజన్ నుంచి బదిలీపై వెళ్తున్న ఎస్సీఆర్ సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సజ్జ భార్గవ్ కృష్ణను ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టనున్న దినకర్ ప్రణీత్‌లను శుక్రవారం మజ్దూర్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికారులను యూనియన్ జోనల్ అధ్యక్షుడు శ్రీనివాస్, డివిజనల్ సెక్రటరీ రవీందర్, ఏడీఎస్ చిలుక స్వామి, స్వరూప, సలీం, వెంకటేశ్వర్లు శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఆర్ట్స్ కాలేజీ ఎదుట బర్త్‌డే కేక్ కటింగ్‌లు నిషేధం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ ఎదుట, ఆవరణలోబర్త్‌డే కేక్ కటింగ్‌లను నిషేధిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఆవర్ణలో రిజిస్ట్రార్ పేరు మీద బర్త్‌డే కేక్ కటింగులను నిషేధిస్తూ తీసుకున్న ఇనర్ణయంపై బ్యానర్లను ఏర్పాటు చేశారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆర్ట్స్ కాలేజీని హెరిటేజీ భవనంగా గుర్తించింది ఇటీవల రూ. 12 కోట్లతో లేజర్ షోలు, మ్యూజికల్ ఫౌంటేన్లు ఏర్పాటు చేసిన విషయం విదితమే. బర్త్‌డే కేక్ కటింగ్‌లతో ఏర్పడే చెత్త ఇతర వ్యర్థాలతో పర్యాటకులకు ఇబ్బందులు తలెత్తకుండా ఓయూ అధికారులు నిషేధం నిర్ణయాన్ని తీసుకున్నారు. రెండేళ్ల క్రితం ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభలు, సమావేశాల నిర్వహణను నిషేధించిన విషయం విదితమే.

లుకేమియాకు నిమ్స్‌లో నాణ్యమైన వైద్యం: డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: తొలి దశలోనే లుకేమియా వ్యాధిని గుర్తిస్తే మందులతో నయం చేయొచ్చని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. ఆస్పత్రిలో లుకేమియా వ్యాధిగ్రస్తులకు నాణ్యమైన వైద్యం అందిస్తున్నామన్నారు. శుక్రవారం క్రానిక్ మైలాడ్ లుకేమియా (సీఎంఎల్) దినోత్సవం సందర్భంగా లెర్నింగ్ సెంటర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఈ వ్యాధి వస్తే జీవితం ముగిసిపోయిందని ఆందోళన చెందేవారని, ఇప్పుడు ఆందోళన అవసరం లేదన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతతో సరైన సమయంలో వైద్యం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చన్నారు. బోన్‌మారో లాంటి చికిత్సలతో వ్యాధిని నియంత్రించే వెసులుబాటు ఉందన్నారు.

సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దా

- సమస్యలన్నీ పరిష్కరించా
- మెరుగైన వసతులు కల్పించాం
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



శివభాగ్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

అమీర్‌పేట: అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దామని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం అమీర్‌పేట డివిజన్‌లో రూ. 1.21 కోట్ల వ్యయంతో చేపట్టే ఏడు అభివృద్ధి పనులకు మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కుమ్మరి బస్తీలో రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు, అమోఘ హోటల్ ఎదురుగా రూ. 6 లక్షలతో మంచినీటి పైప్‌లైన్, గాయత్రీనగర్‌లో రూ. 10 లక్షలతో సివరేజ్ పైప్‌లైన్, ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద రూ. 33 లక్షలతో మంచినీటి పైప్‌లైన్, బీటైప్ క్వార్టర్స్ వద్ద రూ. 23 లక్షలతో మంచినీటి పైప్‌లైన్, రూ. 34 లక్షలతో సీసీ రోడ్డు, శివభాగ్‌లో రూ. 5.50 లక్షల వ్యయంతో సివరేజ్ పై ప్‌లైన్ పనులకు తలసాని శంకుస్థాపనలు చేశారు. ప రిసర ప్రాంతాల్లో ప్రజలను మంత్రి కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

- ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన మంత్రి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాని అధికారులను ఆదేశించారు. కుమ్మరి బస్తీలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, శివభాగ్‌లో కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు.
- గడచిన ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి పనులు కేవలం 9 సంవత్సరాల్లో చేసి చూపించామని మంత్రి తలసాని స్పష్టం చేశారు. అనేక దీర్ఘకాలిక సమస్యలకు కూడా పరిష్కారం చూపామన్నారు.
- పార్కుల అభివృద్ధికి పెద్ద పీట వేశామన్న ఆయన కాలనీ, బస్తీల్లో స్ట్రీట్ లైట్లు, సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని చెప్పారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు.
- కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, జీహెచ్ఎంసీ డీసీ జగన్, ఈఈ ఇందిర, హరిశంకర్, మోహన్, భార్గవ్, సుధాకర్, కిరణ్మయి, స్థానిక నేతలు హనుమంత్ రావు, గులాబ్‌సింగ్, నర్సింహ, లలితా చౌహాన్, అశోక్ యాదవ్, కాలనీ అసోసియేషన్‌ల నాయకులు పాల్గొన్నారు.

నేడు బన్సీలాల్‌పేట్‌లో మంత్రి పర్యటన

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం పర్యటించనున్నారు. డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో కోటి 44 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం పద్మారావునగర్ వెస్లీ చర్చి వద్ద రూ. 51.50 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు శివానంద ఆశ్రమం, హమాలీబస్తీ, బన్సీలాల్‌పేట్ సీ క్లాస్, బర్కత్ బస్తీ, రామస్వామి కంపౌండ్‌లో చేపట్టనున్న పలు ప్రజాభివృద్ధి పనులను కార్పొరేటర్ కె.హేమలతతో కలిసి ప్రారంభిస్తారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొంటారని డివిజన్ అధ్యక్షులు ఎల్.వెంకటేషన్, జి.పవన్ కుమార్ గౌడ్ తెలిపారు.

ఘనంగా కార్పొరేటర్ సామల హేమ జన్మదిన వేడుకలు



మంత్రి కేటీఆర్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఆశీస్సులు తీసుకుంటున్న కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ జన్మదిన వేడుకలను శుక్రవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి కేటీఆర్, డిప్యూటీ స్పీకర్ పద్మారావులను మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయిలు అందించి ఆశీస్సులు పొందారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో బర్త్‌డే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్పొరేటర్ హేమ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రాజు

లాలాపేట: బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నల్లకుంట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్‌సీసీ సౌజన్యంతో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ ఏసీపీ జి.శంకర్‌రాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, పాదచారుల జీబ్రా క్రాసింగ్ చేస్తున్నప్పుడు వాహనాలు ఏవిధంగా ఆపాలి, దీంతోపాటు ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణ ఏవిధంగా చేస్తారు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఏసీపీ వివరించారు. ట్రాఫిక్ నియమాలు తెలియకుండా యువత వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాల బారిన పడి ఇతరులను ఏవిధంగా గాయపరుస్తున్నారు... ఆస్తి నష్టం చేస్తున్నారు అనే విషయాలను వివరించారు. వేగం కన్నా ప్రాణం మిన్న అని స్పష్టం చేశారు. రహదారులపై అందరూ క్రమశిక్షణగా వ్యవహరించాలన్నారు. మైనర్ డ్రైవింగ్ చట్ట రీత్యా నేరం అన్నారు. 18 ఏళ్లు నిండిన తరువాతే డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తరువాతనే వాహనాలు నడపాలని సూచించారు. ఆ వాహనాలకు ఫిట్నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఏసీపీ శంకర్ రాజు నివృత్తి చేశారు. కార్యక్రమంలో నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, టీటీఐ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ జి.సుకన్య, ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం



తార్నాకలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

లాలాపేట: దశాబ్దాల నుంచి పెడింగ్‌లో ఉన్న 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో ఆమోదం లభించడం చారిత్రాత్మకమైన నిర్ణయం అని మాజీ మేయర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండ కార్తీకరెడ్డి అన్నారు. నూతన పార్లమెంట్ భవనంలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. శుక్రవారం తార్నాక చౌరస్తాలో ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

మేకల కీర్తి నేతృత్వంలో..

చిలకలగూడ: పార్లమెంట్‌లో మహిళల 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో బీజేపీ నాయకురాలు మేకల కీర్తి నేతృత్వంలో శుక్రవారం శ్రీనివాసనగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళ రిజర్వేషన్ బిల్లు ప్రధాని మోదీ చొరవతో నేటికి సాకారమైందన్నారు. మహిళల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, బీజేపీ మహిళవింగ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... సీతాఫల్‌మండి నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గం మధ్యలోని పట్టాలపై గురువారం రాత్రి సుమారు 25–30 ఏళ్ల మధ్య వయస్సు గల యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఉద్యమకారుడికి ఆర్థికసాయం

ముషీరాబాద్: తెలంగాణ ఉద్యమకారుడు దివంగత హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి అనుచరుడు సర్దార్ గురుచరణ్‌సింగ్‌కు నాయిని నర్సింహ్మారెడ్డి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్‌రెడ్డి ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని విషయం తెలిసి సాయం చేశామన్నారు.

అభివృద్ధి.. సంక్షేమానికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తాం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బేగంపేటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు వెనుకాడేది లేదని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బేగంపేట డివిజన్ అంబేద్కర్‌నగర్, ప్రకాష్‌నగర్, రామలింగేశ్వర దేవాలయం దగ్గర, ద్వారకాదాస్ పార్కు వద్ద రూ. 2.85 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యలను సైతం కోట్లాది రూపాయల వ్యయంతో పరిష్కరించామన్నారు. బేగంపేట నాలా పరీవాహక ప్రాంతాల్లో వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేసి పూర్తిస్థాయిలో వరద ముంపు సమస్య పరిష్కారం జరపనున్నట్లు చెప్పారు. బేగంపేట డివిజన్‌లో శ్యాంలాల్ బిల్డింగ్ పరిసర ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా పోరాడుతున్న ధనియాలగుట్ట శ్మశానవాటికను కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని ఆయన గుర్తుచేశారు. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

24న అడెల్ఫీ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు



బ్రోచర్‌ను ఆవిష్కరించిన సంస్థ ప్రతినిధులు

అమీర్‌పేట: న్యూయార్క్‌లోని అడెల్ఫీ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, పబ్లిక్ హెల్త్ డీన్ డాక్టర్ డెబోరా హంట్ తెలిపారు. శుక్రవారం అమీర్‌పేట ఆదిత్య పార్కు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... యూనివర్సిటీ హబ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో ఈ నెల 24న ఆదివారం ఆదిత్య పార్క్ హోటల్‌లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నామనని చెప్పారు.హెల్త్ కేర్, ఇన్ఫర్మేటిక్స్, బిజినెస్ ఎనలిటిక్స్‌లో మాస్టర్ సైన్స్ కోర్సులను అందిస్తున్న సంస్థ 2023 ఫాల్ సెమిస్టర్ కోసం విద్యార్థులను ఆహ్వానిస్తున్నామన్నారు. యూనివర్సిటీ హబ్, అడెల్ఫీ వర్సిటీ సంయుక్తంగా తాజాగా సప్‌లెచైన్ మేనేజ్‌మెంట్, కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు రాబర్ట్ బి.విలం స్టాడ్,డాక్టర్ మేరీ అన్నే హైలాండ్, అనిల్ పల్లా పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతోనే చేనేత పరిశ్రమకు దెబ్బ



మాట్లాడుతున్న హేమలత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే చేనేత పరిశ్రమ దెబ్బతిన్నదని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు కె.హేమలత అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికుల జాతీయ కన్వెన్షన్ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు పెట్టుబడులు అప్పజెప్పి కార్మికుల పొట్టకొడుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి కార్మికులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని కోరారు. సభకు ముందు సీఐటీయూ జాతీయపతాకాన్ని ఆమె ఆవిష్కరించారు. సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు, జాతీయ కార్యదర్శి కరిమాలయన్, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, తెలంగాణ ప్రధాన కార్యదర్శి పాలడుగుభాస్కర్, ఎస్.రమ, కూరపాటి రమేష్, శ్రీకాంత్ వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరుగుదొడ్డిలో నీరు పోయలేదని యువతులపై దాడి

వెంగళరావునగర్: లెట్రిన్‌లో సరిగా నీరు పోయలేదంటూ ఇద్దరు యువతులపై ఓ యువకుడు దాడి చేశాడు. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ బస్తీలో ఉన్న ఓ గృహంలో పక్క పక్కనే ఉండే మూడు గదుల్లో మూడు కుటుంబాలకు చెందిన వారు అద్దెకు ఉంటున్నారు. మూడు గదుల వారికి ఒకే లెట్రిన్ (జాయింట్) ఉంది. దానినే మూడు గదుల్లో వారు వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో అందులోని ఒక పోర్షన్‌లో నివాసం ఉండే బాల్‌రాజ్ అనే ప్రైవేటు ఉద్యోగి శుక్రవారం బాత్రూంకు వెళ్లాడు. అక్కడ అపరిశుభ్రంగా ఉండటాన్ని చూసిన ఆ యువకుడు ఆవేశంగా పక్క గదిలో అద్దెకు ఉంటున్న స్వాతి అనే యువతిని దుర్భాషలాడాడు. లెట్రిన్‌లో నీరు సరిగా పోయలేదంటూ పరుష పదజాలంతో మాట్లాడాడు. అదేమని ప్రశ్నించిన ఆమెపై బకెట్‌తో దాడి చేశాడు. అతనిని వారించడానికి వచ్చిన స్వాతి సోదరి శ్రావణిపై కూడా దాడి చేశాడు. దాంతో ఇరువురు అక్కాచెల్లెళ్లకు గాయాలయ్యాయి. దాంతో స్వాతి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

సనత్‌నగర్: మోడల్‌కాలనీలో జరుగుతున్న వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమార్చన పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. కాలనీ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమార్చన చేశారు. మోడల్‌కాలనీ ప్రతినిధులు జేఎస్‌టీ సాయి, బుచ్చిబాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జైబోలో గణేష్ మహరాజ్ కీ...

వినాయక నవరాత్రి ఉత్సవాలు సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల పరిధిలో వైభవంగా కొనసాగుతున్నాయి. వాడవాడలా కొలువైన గణనాథుల విగ్రహాలు భక్తుల నుంచి విశేష పూజలందుకుంటున్నాయి. గణేష్ మండపాల వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు, ప్రసాదాల వితరణ జరుగుతున్నాయి.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం



బేగంపేటలో..



బేగంపేటలోని అర్బన్ మనీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యాలయంలో..



ఐడీహెచ్ కాలనీలో...



ఓయూలో పూజలందుకుంటున్న ఏకదంతుడు



అమీర్‌పేట రిలయన్స్ లేన్ గణనాథుని వద్ద మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి



బాపునగర్‌లో కాంగ్రెస్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్



లక్ష్మీనగర్‌లో అన్నదానం



తార్నాక వంజరి భవన్‌లో...



గణేష్ యూత్ అసోషియేషన్ మండపంలో మేకల సారంగపాణి



మధురానగర్‌కాలనీలో...



బోలక్‌పూర్ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న ఉపాధ్యాయురాలు



రైల్వే ఉద్యోగుల పరపతి పరిమిత సంఘంలో...



రెజిమెంటల్‌బజార్‌లో...